క్లుప్తంగా

నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



బెల్లంకొండ: మండలంలోని కేతవరం గ్రామంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన వజ్ర లక్ష్మీనరసింహస్వామి స్వయంభు దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొండపై నూతనంగా నిర్మించిన అమ్మవారి దేవాలయం దిగువ భాగంలో స్వామివారు వెలసిన స్వయంభు ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు దేవదాయ శాఖ ఈఓ అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసన్న కుమారాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత గుదిబండ వెంకట సాంబిరెడ్డి శంకుస్థాపన చేశారు. త్వరితగతిన ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ సాంబశివారెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆసం నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దీపోత్సవం.. నేత్రపర్వం



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని నాగన్నకుంటలోని శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయంలో కార్తిక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి కోటి దీపోత్సవం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువులు కరుణాకర్ ఆధ్వర్యంలో శ్రీశ్రీనివాస పద్మావతి బృందం కోలాట ప్రదర్శనతో భక్తులను అలరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం రమణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.



పత్తి రైతు పరిస్థితి దారుణం

- పత్తి తీసేందుకు కూలి కేజీకి రూ.15
- కూలీలను ఇంటి నుంచి పొలం, పొలం నుంచి ఇంటికి రవాణా ఖర్చు రైతుదే..
- సగటున ఎకరాకు ఆరు క్వింటాళ్లకు మించి రాని దిగుబడి
- ఎకరాకు అయ్యే ఖర్చు కౌలుతో కలిపి రూ.55,000
- వచ్చే దిగుబడి రూ.36వేలు
- ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రైతు భరోసా, నష్ట పరిహారం ఇస్తే కొంతవరకు విముక్తి
- మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తేనే ఊరట

పెరిగిన ఖర్చులు.. అప్పల తిప్పలు



రుద్రవరంలో పత్తి తీస్తున్న కూలీలు

అచ్చంపేట: మండలంలో పత్తిరైతుల పరిస్థితి అతి దీనంగా ఉంది. ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టిస్తే ఆదాయం రాకపోగా చివరకు అప్పులు మిగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఎన్నికల హామీగా ఇస్తానన్న రైతు భరోసా రూ.20వేలు ఇచ్చి, ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న పంటలకు పరిహారం, పండిన పంటకు మద్దతు ధరగా క్వింటా పత్తి రూ.10వేలు ప్రకటిస్తేగాని రైతులు అప్పుల ఊబి నుంచి బయటపడే పరిస్థితి కనిపించడంలేదు. లేకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని పలువురు రైతులు వాపోతున్నారు. గత రెండు నెలల వ్యవధిలో ఒక్క అచ్చంపేట మండలంలో ముగ్గురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం గమనార్హం.

సగటున ఎకరాకు 6 క్వింటాళ్లే..

పత్తి తీసేందుకు గతంలో రోజుల లెక్కన ఉండేది. కాని ఇప్పుడు కిలోల లెక్కకు మారింది. ప్రస్తుత పరిస్థితిలో కొన్ని గ్రామాలలో కొంతమంది రైతులకు ఎకరాకు 7 నుంచి 9 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినా మరికొన్ని గ్రామాల్లో మాత్రం 3 నుంచి 6 క్వింటాళ్లకు మించి దిగుబడిలేదు. సగటున ఎకరాకు ఆరు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. దీనికి తోడు గులాబీరంగు పురుగు, పచ్చదోమ, తెల్లదోమల ఉధృతి గణనీయంగా ఉంది. వీటిని అదుపు చేయడం రైతుల తరం కావడంలేదు. ఇవి సోకిన పొలాలలో రెండు మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో పత్తి తీసేందుకు కనీసం కూలి ఖర్చుకూడా రాకపోవడంతో పంటను దున్నేసి మొక్కజొన్న వేస్తున్నారు.

కోతకు వచ్చిన తరువాత అయ్యే ఖర్చు...

గతంలో పత్తికోతకు రోజుకు రూ.250 నుంచి రూ.300వరకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ లెక్కలు మారాయి. కిలో రూ.15 ఇస్తేనే వస్తామంటూ రున్నారు. సగటున ఎకరాకు ఆరు క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితులు లేవు. ఈ లెక్కన కేవలం పత్తి తీసినందుకు క్వింటాకు రూ.1500 చొప్పున ఆరు క్వింటాళ్లకు రూ.9000 అవుతుంది. కూలీలను ఇంటినుంచి పొలం, పొలం నుంచి ఇంటికి తీసుకు రావాల్సిన బాధ్యత కూడా రైతుదే.. ఆటోలో గాని, ట్రాక్టరులోగాని ఒక్కో కూలీకి రానుపోను రూ.50 చొప్పున అయిదుకురు కూలీలకు రూ.250, క్వింటా పత్తిని ఆటోగాని, ట్రాక్టరులోగాని ఇంటికి చేర్చాలంటే క్వింటాకు రూ.500 చొప్పున ఆరు క్వింటాళ్లకు రూ.3వేలు ఖర్చు అవుతుంది. కూలీలు అలసిపోకుండా మధ్యలో ఒకసారి పానియాలకు మరో రూ.150. పత్తి కోతకు వచ్చిన దగ్గర నుంచి అయ్యే ఖర్చు పంట ఇంటికి వచ్చే వరకు అయ్యే ఖర్చు రూ.12,500. పంట కోతకు రాకముందు రూ.38,000 కాగా కోతకు వచ్చిన తరువాత అయ్యే ఖర్చు రూ.12500, మొత్తం కలుపుకొని రూ.50,500లు అవుతుంది.

ఎకరా పత్తి పంట వేస్తే వచ్చే రాబడి...

ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం మంచి నాణ్యమైన పత్తి అయితే క్వింటా రూ.6000 మించి లేదు. ఎకరాకు రూ.6వేలు చొప్పున ఆరు క్వింటాళ్లకు వచ్చే దిగుబడి కేవలం రూ.36,000మాత్రమే. రైతులు తాను, తనవాళ్లు ఉచితంగా పనిచేశారనుకున్నా అయ్యే ఖర్చులలో వచ్చే రాబడి పోను ఇంటి రూ.15000లకు పైగా అప్పుల పాలవుతాడు.

ఇచ్చిన హామీలు నెరవేరిస్తేనే గట్టెక్కేది..

ప్రభుత్వానిగా నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల హామీలో ప్రకటించిన విధంగా పెట్టుబడి సహాయంగా రూ.20వేలు ఇవ్వాలి. పండిన పంటకు గిట్టుబాటు ధరగా క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.10,000 ప్రకటించాలి. అలా ప్రకటించినట్లయితే ఆరు క్వింటాళ్ల పత్తికి క్వింటా ఒక్కంటికి రూ.10వేలు చొప్పున రూ.60వేలు, ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు రూ.20వేలు ఇస్తే మొత్తం రూ.80వేలు అవుతుంది. అప్పుడు రైతుకు ఎకరా పత్తి పంటకు అయ్యే ఖర్చు రూ.50వేలు పోను, తాను పడ్డ కష్టానికి ప్రతి ఫలింగా మరో రూ.30వేలు వచ్చినట్లు భావించి, అప్పులబాధనుంచి విముక్తుడై కొంతవరకైనా సంతృప్తి పడే అవకాశం ఉంటుంది.

ఎకరా భూమిలో పత్తి పంట వేయాలంటే.....

ఎకరా భూమిలో పత్తిపంట వేయాలంటే రెండు నాగళ్లు, మూడు నాగళ్లతో దుక్కి దున్నాలి. అందుకు రూ.2వేలు ఖర్చు అవుతుంది. రెండు సార్లు గొర్రు తోలాలి. అందుకు మరో రూ.6వేలు అవుతుంది. గుంటక ఒకసారి దున్నాలి అందుకు రూ.600, విత్తనాలు విత్తేముందు సాళ్లు దున్నినందుకు రూ.1500, విత్తనాలు విత్తేందుకు నలుగురు కూలీలు, ఒక్కొక్కరికి రూ.250 చొప్పున రూ.1000, పడి విత్తనాలు వేసినందుకు ఇద్దరు కూలీలకు రూ.500, హైబ్రిడ్ రకం పత్తి విత్తనాలు కొనుగోలు ఎకరాకు మూడు ప్యాకెట్లు, ప్యాకెట్ ఒక్కంటికి రూ.850 చొప్పున రూ.2550, నాలుగు కట్టలు డీఏపీ వేసినందుకు రూ.3500, పురుగు మందులు కొనుగోలుకు రూ.3000, వాటిని పంటపై పిచికారీ చేసినందుకు రూ.2000, కౌలు ఎకరాకు రూ.15000 చొప్పున ఎకరా విస్తీర్ణంలో పంట కోతకు వచ్చేంతవరకు అయ్యేఖర్చు రూ.38,000.

అన్నివర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా జీవించాలి

- సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య
- షెడ్యూల్ కులాలు, తెగల అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు



సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో అన్ని కులాలు, మతాల వారు అన్నదమ్ముల్లా, ఒక కుటుంబ సభ్యుల్లా ఒకరినొకరు గౌరవించుకుని జీవించాలని సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో క్రైమ్ ఇన్వెస్టిమెంట్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, తెగల అత్యాచారాల నిరోధక చట్టంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీఎస్పీ గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ దళిత, గిరిజనులను అవమాన పరిచినా, వివక్షకు గురిచేసినా, అత్యాచారాలు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. దళిత, గిరిజనులకు ప్రభుత్వాలు, పోలీసు, రెవెన్యూ యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగబద్ధంగా మానవ హక్కుల ఉల్లంఘటన జరుగకుండా ప్రతి గ్రామంలో శాంతియుతమైన కమిటీలు అన్నికులాలు, వర్గాల నుంచి ఏర్పాటు చేసుకుని, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించే విధంగా గ్రామ పెద్దలు చూడాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి బహుమతులు అందజేశారు.సీఐడీ సీఐ విక్టర్, సీఐడీ ఎస్ఐ మొహమ్మద్ బాషా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్, డీబీఆర్సీ (దళిత బహుజన రీసోర్స్‌సెంటర్) రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా మహేష్



సత్తెనపల్లి: సీపీఎం సత్తెనపల్లి మండల కార్యదర్శిగా పెండ్యాల మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామంలో జరిగిన సీపీఎం మహాసభలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. ఈసందర్భంగా 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీని ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

పారిశుద్ధ్య పరిరక్షణపై అవగాహన అవసరం

ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్

దొడ్లేరు(క్రోసూరు): పారిశుద్ధ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. బుధవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని దొడ్లేరు సచివాలయం–1లో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రదర్శన, ప్రతిజ్ఞ నిర్వహించటం జరిగింది. మరుగుదొడ్లు వాడదాం–పరిసరాలు పరిరక్షిద్దాం, వెయ్యకు చెత్త–చెయ్యకు పాపం, అంటూ నినాదాలు చేశారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్త అనుపమ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధనరేఖ, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు .



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర

క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు

బెల్లంకొండ: పత్తిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంటను విక్రయించుకోవాలని క్రోసూరు డివిజన్ ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. బుధవారం మండలంలోని చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళారులకు తక్కువ ధరకు పత్తి విక్రయించి రైతులు మోసపోవద్దని తెలిపారు. సీసీఐ కేంద్రాలలో పత్తి కనీస మద్దతు ధర మధ్యస్థ పింజ క్వింటాళ్లు రూ.7012, పొడవు పింజ రకాలకు రూ.7521 పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం బెల్లంకొండలో పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మండల వ్యవసాయధికారి కృష్ణయ్య, వీఏఏ ప్రసాదరావు, గ్రామ ఉద్యాన సహాయకురాలు రజని, రైతులు పాల్గొన్నారు.



చంద్రాజుపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు

ప్రకృతి వ్యవసాయం మేలు..

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేయడం వలన ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయం తయారు చేయటంపై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి పంట ప్రస్తుతం కంకి దశలో ఉంది కాబట్టి సప్త ధాన్యాల కషాయం పిచికారీ చేయడం వలన గింజ తాలుగా మారకుండా గట్టిగా ఉంటుందన్నారు. కషాయం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ ప్రియాంక, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ కె.పూజ, ఐసీఆర్పీ కె.సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

నకరికల్లు: లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మిన దుకాణ యజమానిపై సీడ్ కంట్రోల్ ఆర్డర్ 1983, ఈసి యాక్ట్ 1955 చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. నకరికల్లులోని చిన్నయ్య అండ్ సన్స్ విత్తనాల దుకాణంతో పాటు పలు దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సు పొందిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విక్రయ రసీదుపై రైతు కొనుగోలు చేసిన విత్తన రకం, రైతు సంతకం, అమ్మినవారి సంతకం తప్పని సరిగా ఉండాలని డీలర్లను ఆదేశించారు.

పొలం పిలుస్తుంది.....

మండలంలోని చేజర్ల, చల్లగుండ్ల అడ్డరోడ్డు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏఓ కె.దేవదాసు రైతులకు పలు సూచనలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి, ఉద్యానవన సహాయకులు వి.వంశీ, ఏఈఓ కె.దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు, తురకపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని మొక్కజొన్న సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రబీలో పంటల బీమా పథకం వర్తిస్తుందని, డిసెంబర్ 31లోపు ఎకరానికి రూ.630 ప్రీమియం చెల్లించాలన్నారు. ఉద్యానవనశాఖ సహాయకులు ఎ.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

సత్తెనపల్లి: గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రిటైర్డ్ తెలుగు పండితుడు మంచికంటి వెంకటేశ్వరరావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మంచికంటి

పెదకూరపాడు: ప్రతి విద్యార్థి డిజిటల్ లైబ్రరీలపై అవగాహన కలిగి ఉండాలని పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెదకూరపాడు డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి శాఖా గ్రంథాలయంలో డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి వాణి, మహిళా కానిస్టేబుల్ విమల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి: ఉన్నత విలువలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే పుస్తకపఠనం ఎంతగానో దోహదపడుతుందని ధరణికోట ఆర్‌వీవీఎన్ కళాశాల కరస్పాండెంట్ చేకూరి జాజి బాబు అన్నారు బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి శాఖ గ్రంథాలయ ఇన్‌చార్జి ఎం.వెంకాయమ్మ అధ్యక్షత వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

రాజుపాలెం: మండలకేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 14వ తేదీ నుంచి జరిగిన గ్రంథాలయ వారోత్సవాలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీఓ సత్యనారాయణ బహుమతులను అందించారు. గ్రంథాలయ అధికారి కెఎస్ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజుపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో బహుమతులు సాధించిన విద్యార్థులను ఎస్ఎఫ్ఎస్ పాఠశాల హెచ్ఎం ఫాదర్ పి.ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. రాజుపాలెం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీలలో ప్రథమ, ద్వితీయ పొందిన కె.ప్రభావతి, కె.భరత్, కె.పూజమనస్వి, ఎం.కారుణ్యదీక్షిత, వి.రేవంత్, జి.రేవంత్, వై.మన్విత, డి.జాన్‌స్టీఫెన్, ఎ.రాజశేఖర్‌రెడ్డి, వి.సాయి ప్రణీత, కె.కిరణ్‌లను అభినందించిన ఫాదర్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో విజయపీటర్, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రోసూరు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిధులుగా క్రోసూరు మాజీ యార్డు చైర్మన్ కాంద్రుకాశియ్య, గ్రంథాలయ సూపరింటెండెంట్ షేక్ ఖయ్యుం, బండారు మైసూరుబాబు, హిందీ పండిట్ షేక్ సుభాని పాల్గొన్నారు. వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు షేక్ ఖయ్యుం తన తండ్రి జ్ఞాపకార్ధం మొమెంటోలు అందచేశారు.

మత్స్యం.. మృత్యువేదన



పులిచింతల ప్రాజెక్టు దిగువన ఒడ్డుకు కొట్టుకు వచ్చిన మృతిచెందిన చేపపిల్లలు

అచ్చంపేట: మత్స్యకారుల ఆదాయ వనరులు పెంచాలనే ఉద్దేశంతో మత్స్యశాఖ ఇటీవల పులిచింతల ప్రాజెక్టులో వదిలిన చేపపిల్లలు వేల సంఖ్యలో మృత్యువాతపడ్డాయి. బుధవారం చనిపోయిన చేపపిల్లలు ప్రాజెక్టు దిగువ సమీపంలోని కృష్ణానదీతీరానికి కొట్టుకు రావడాన్ని స్థానికులు గమనించారు. చేప పిల్లల మృతికి కారణం తెలియాల్సి ఉంది. రిజర్వాయర్‌లోని నీరు కలుషితం వల్ల చేప పిల్లలు మరణించాయా? లేక దిగువకు వచ్చాక మృతిచెందాయా అనేది మత్స్యశాఖ తెలుసుకోవాల్సి ఉంది. ప్రాజెక్టులో వదిలిన తర్వాత అధికారులు చేపపిల్లల సంరక్షణను గాలికి వదిలేయడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మత్స్య దినోత్సవం ముందు రోజే వేల సంఖ్యలో చేపపిల్లలు మరణించడం బాధాకరం.

ధర్నా విజయవంతం చేయండి

ముప్పాళ్ళ: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్‌మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 26వ తేదీన నర్సరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, రైతు సంఘం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య కోరారు. మండల కేంద్రమైన ముప్పాళ్లలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ గతంలో ఢిల్లీ పోరాటం జరిగిన సందర్భంగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దొడ్డిదారిన రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. పంటలకు మద్దతు ధర చట్టం రూపం తీసుకురావటంలో విఫలమయిందన్నారు. వ్యవసాయ బోర్లకు మోటార్లు పెట్టే ప్రక్రియ ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20వేలు రైతులకు, కౌలు రైతుల ఖాతాలో జయ చేయాలన్నారు. పలు డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీన జరిగే ధర్నాలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కౌలు రైతుసంఘం మండల నాయకులు తొరటి అమర లింగేశ్వరరావు, నాయకులు గారా జాలయ్య, మార్పుల వెంకటరెడ్డి, కందిమళ్ళ సాంబశివరావు, తోట వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ, చలమయ్య

చిన్నారి శ్రీవిష్ణుకు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఎల్‌కేజీ విద్యార్థి దేవతి శ్రీవిష్ణు ఆటల పోటీల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా బుధవారం చిన్నారిని ఆర్యవైశ్య సంఘ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, ఆవోపా అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి పెండ్యాల కాశి మల్లేశ్వరరావు, దేవతి సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు



నర్సింగ్ కాలేజీలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ

రాజుపాలెం: సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, క్షణికావేశంలో ఆత్మహత్యయత్నాలకు పాల్పడవద్దని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని కోటనెమలిపురి పరిధిలో గల డాక్టర్ అంజిరెడ్డి నర్సింగ్ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నతమైన చదువులు చదివి భవిష్యత్‌లో స్థిరపడాలని సూచించారు. సమస్యలు వచ్చినప్పుడు పరిష్కరించుకోవాలే తప్ప వేరే ఆవేశాలకు గురికాకూడదని తెలిపారు. ఆకతాయిలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కళాశాలల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ వేణుగోపాల్, కాలేజీ సిబ్బంది ఉన్నారు.